క్లుప్తంగా

కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీపై ముగిసిన శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీపై ఐదు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్, ఏడబ్ల్యూఎస్ ఆర్కిటెక్చర్ అభివృద్ధి, ఏడబ్ల్యూఎస్ సేవలను ఉపయోగించి ప్రాథమిక అనువర్తనాలు అమలు చేయడం తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్టు వివరించారు.

అధ్యాపకులకు జాతీయస్థాయి అవార్డులు

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు నాలుగు విభాగాల్లో జాతీయస్థాయి ఉత్తమ అవార్డులు లభించినట్టు కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నరేష్‌కు ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్ అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అవార్డు, విద్యార్థుల నియామకం, కెరీర్ అభివృద్ధికి గాను డీన్, కెరియర్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి ఎం.రాధికామణికి అత్యుత్తమ ప్రతిభ అవార్డు, సీఎస్‌ఈ విభాగాధిపతి మంజుల దేవరకొండ వెంకట్‌కు ఉత్తమ గురువు అవార్డు, బోధనలో సీఎస్‌ఈ విభాగాధిపతి ఎంవీ రాజేష్‌కు అత్యుత్తమ ప్రతిభ అవార్డులు వచ్చాయన్నారు. నీతి ఆయోగ్‌తో గుర్తింపు పొందిన కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సిస్ (సీఎస్సీ) ఇండియా నిర్వహించిన నేషనల్ టీచర్స్ డే వేడుకల్లో తమ కళాశాల అధ్యాపకులకు అవార్డులు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్–అకడమిక్స్ కె. సత్యనారాయణ, వై.జయబాబు తదితరులు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత


విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ ప్రసాదరావు సహకారంతో సైకిళ్లను ఉచితంగా అందజేశారు. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తుని హెచ్‌ఆర్ మేనేజర్ చంద్రశేఖర్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సౌజన్య, ఫీల్డ్ ఆఫీసర్ దివాకర్ విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. తుని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి కార్పొరేట్ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా పది మంది విద్యార్థినులకు సైకిళ్లను సమకూర్చినట్టు పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు సైకిళ్లు ప్రయోజనంగా ఉంటాయన్నారు. విద్యార్థినులు సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్లతోనే బంగారు భవిష్యత్


ప్రత్తిపాడులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఐలాజ్ రాష్ట్ర కార్యదర్శి బుగత శివ

ప్రత్తిపాడు: భావి తరాలకు బంగారు భవిష్యత్తును ఇవ్వగలిగేది ఉపాధ్యాయులే అని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర కార్యదర్శి బుగత శివ అన్నారు. స్థానిక సరయు కన్వెన్షన్ హాలులో శనివారం అఖిల్ ఐఐటీ టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి స్కూల్ అధినేత ఇనకోటి గంగాధర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుగత శివ మాట్లాడుతూ టీచర్లతో పాటు తల్లిదండ్రులు తమ పిల్లలను తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులకు టీవీ, సెల్ వాడకంపై నియంత్రణ ఉండాలని సూచించారు. అనంతరం 14 మంది ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.


ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు సత్కారం


పేరవరంలో వీఆర్వో కిషోర్ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఏలేశ్వరం: ఇటీవల ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న వీఆర్వో అవసరాల కిషోర్‌ను మండలంలోని పేరవరంలో శనివారం ఘనంగా సత్కరించారు. గ్రామ పెద్దలు బేరి అవరింద్ కుమార్, అవసరాల సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో వీర్వో కిషోర్, దేవి దంపతులను శాలువా, పూలమాలతో సన్మానించారు. వీఆర్వోగా కిషోర్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బేరి సూర్యవరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- శిథిలస్థితిలో వెదుళ్లగెడ్డ బ్రిడ్జి
- తుపానుల సమయంలో నిలిచిపోతున్న రాకపోకలు
- మృత్యువాత పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


వెద్దుళ్లగెడ్డపై ప్రమాదకరంగా మారిన కాజ్‌వే

కోటనందూరు: కాకినాడ–అనకాపల్లి జిల్లాలను కలిపే వెదుళ్లగెడ్డపై జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న కాజ్‌వే (బ్రిడ్జి) ప్రమాదకరంగా మారింది. బ్రిటిష్‌వారి కాలంలో నిర్మించిన ఈ బ్రిడ్జిపై తుపానుల సమయంలో గెడ్డ ఉగ్రరూపం దాల్చి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి పరిస్థితిని అంచనా వేయలేని ప్రయాణికులు ఎంతో మంది గెడ్డలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారు. ఈ కాజ్‌వేకు ఇరువైపులా ఉన్న రోడ్డును అధికారులు అభివృద్ధి చేస్తున్నారు. కాజ్‌వే ఇరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో దీని అభివృద్ధిని మాత్రం రెండు జిల్లాల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.


కాజ్‌వే (బ్రిడ్జి)పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

వరదలు వస్తే అవస్థలు

పరిసర ప్రాంతాల్లోని చిన్న కాలువలు, గెడ్డల్లో ప్రవహించే నీరు తాండవనదిలో చేరేందుకు వేలాది వాహనాలు తిరిగే తుని–నర్సీపట్నం రోడ్డుపై మండలంలోని కాకరాపల్లి శివారు ఉప్పరిగూడెం వద్ద వెదుళ్లగెడ్డపై కాజ్‌వే నిర్మించారు. కాలక్రమంలో రోడ్డు ఎత్తు పెరిగిపోవడంతో కాజ్‌వే మరింత కిందకై పోవడం, ఇరువైపులా రైలింగ్ లేకపోవడం, కింద ఫిల్లర్ల మధ్య ఖాళీ తక్కువకావడం, పూడిక పేరుకుపోవడం వంటి కారణాలతో వరదల సమయంలో నీరు భారీగా కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తోంది. వరదలు, తుపానుల సమయంలో నిరీక్షణను సహించలేని అనేకమంది ప్రయాణికులు కాజ్‌వేను దాటే క్రమంలో గెడ్డలో కొట్టుకుపోయి మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. ఈ బ్రిడ్జిని దాటేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో తుపానుల సమయంలో బ్రిడ్జికి ఇరువైపులా రోజుల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయిన పరిస్థితులూ ఉన్నాయి. తుపానుల సమయంలో రెండు జిల్లాల అధికార యంత్రాంగం కాజ్‌వేకు ఇరువైపులా గస్తీ కాసి ప్రయాణికులను కొంతమేర అదుపు చేస్తున్నారు.

కొద్దిపాటి వర్షానికే ఉగ్రరూపం

ఓ మోస్తరు వర్షం కురిసినా వెదుళ్లగెడ్డ ఉగ్రరూపం దాల్చుతుంది. దీనికి ప్రధాన కారణం వర్షం కురిసినప్పుడు ఇటు కోటనందూరు అటు నాతవరం మండలాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న అనేక తాండవ కాలువలు, పొలాలు, చెరువుల్లో నీరు ప్రవహించి వెదుళ్లగడ్డకు చేరుతుంది. దీంతో కొద్దిపాటి వర్షానికే నదిలో నీటి ఉధృతి పెరిగి రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. ఇక తుపానులు సంభవిస్తే గెడ్డ ఉగ్రరూపాన్ని అంచనా వేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాజ్‌వేను బ్రిడ్జిగా అభివృద్ధి చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్రిడ్జిగా అభివృద్ధి చేయాలి



ఓ మోస్తరు వర్షం కురిసినా వెదుళ్లగెడ్డ పొంగి తుని–నర్సీపట్నం రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాంటి సమయంలో గెడ్డకు ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. గతంలో అనేకమంది ఇక్కడ గెడ్డలో కొట్టుకుపోయి చనిపోయారు. రెండు జిల్లాల సరిహద్దులో ఉండడంతో ఈ బ్రిడ్జి అభివృద్ధిని ఇరుజిల్లాల అధికారులు పట్టించుకోవడం లేదు. అనేకమంది ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నా, గెడ్డలో కొట్టుకుపోయి మృత్యువాత పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయం. ఇరు జిల్లాల పాలకులు, అధికారులు వెదుళ్లగెడ్డపై బ్రిడ్జి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

ఆరుగుల మోషే,
మాదిగ రక్షణ పోరాట సమితి అధ్యక్షుడు,
కోటనందూరు

సచివాలయంలో తనిఖీలు


జగన్నాథపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటనారాయణ

కోటనందూరు: మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పి.వెంకటనారాయణ శనివారం తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కౌశలం, మనమిత్ర, వాట్సాప్ గవర్నెన్స్ సర్వేల తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో అన్నసమారాధన

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు


కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలసిన కొత్తూరు వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో శంఖవరం మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గిరిబాబు ఏలేశ్వరం రూరల్ సోషల్ మీడియా విభాగం ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు.

లడ్డూలకు వేలం

ప్రత్తిపాడు: స్థానిక తోటవీధిలోని గణనాథునికి భక్తులు సమర్పించిన లడ్డూలకు శనివారం వేలం పాట నిర్వహించారు. 8 కేజీల లడ్డూను అత్యధికంగా రూ. 6,300లకు బిల్లినేని మహేష్, 5 కేజీల లడ్డూను ఇందుబోయిన నాగు రూ.4,300లకు దక్కించుకున్నారు.

నేత్రదానంపై అవగాహన

గోకవరం: మండలంలోని సంజీవయ్యనగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం కె.బుల్లబ్బాయి ఆధ్వర్యంలో అప్తాల మిక్ ఆఫీసర్ సీహెచ్ ఆనందరావు 220 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో దృష్టి లోపం ఉన్న 14 మందికి త్వరలో కళ్లజోళ్లు అందజేయనున్నట్టు తెలిపారు. అలాగే మండలంలోని పలు ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి వారిలో దృష్టి లోపం ఉన్నవారికి కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. అనంతరం నేత్రదానంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు నేత్రదానం చేసేందుకు అంగీకార పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో సచివాలయ సిబ్బంది నిరసన


గిడజాంలో నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

రౌతులపూడి: ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తమ విధులకు ఆటకం కలిగిస్తూ, వలంటీర్ విధుల అప్పగించి తమను మానసిక క్షోభకు గురిచేస్తోందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు చేపట్టారు. వాట్సాప్ సర్వీసు రిజిస్ట్రేషన్ విధులను బహిష్కరించాలని రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేసినట్టు మండలంలోని సచివాలయ సిబ్బంది తెలిపారు. వలంటీర్లు చేసే సర్వీసు రిజిస్ట్రేషన్ పనులు తమతో చేయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వాట్సాప్ సర్వీసు విధుల నుంచి తమను తప్పించి, న్యాయమైన ప్రభుత్వ విధులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి


కోటనందూరులో చలో విజయవాడ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కోటనందూరు: ఈ నెల 15న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక నూకాలమ్మ గుడి ఆవరణలో శనివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కార్మిక కార్యాలయం ఎదుట నిసరన తెలియజేస్తామన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చలో విజయవాడ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ షేక్ పద్మ పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పూజలు


సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ

అన్నవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) సీఎండీ ఇమ్మాడి పృథ్వీతేజ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

డ్రోన్ సాయంతో కషాయాల పిచికారీ

గోకవరం: మండలంలోని ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి పంటలకు ఆశించే తెగుళ్లు, పురుగులను అరికట్టేందుకు డ్రోన్ సాయంతో కషాయాలను పిచికారీ చేయిస్తున్నట్టు ఎంటీఎల్ బసవన్న గౌడ్, దేవి, సౌజన్య తెలిపారు. మండలంలోని రంపయర్రంపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మాదాసు సత్యనారాయణ, అడపా రామకృష్ణ, వానపల్లి హరిబాబు, తదితర రైతులకు చెందిన 20 ఎకరాల వరి చేలుపై దశపర్ని కషాయం, పాల ఇంగువ, చేపబెల్లం ద్రావణం కలిపి పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు


సామర్లకోట తహసీల్దార్ కార్యాలయంలో మానిటరింగ్ కమిటీ సమావేశం

సామర్లకోట: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖాధికారి వి.మురళీధర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి పి.రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్, పోలీసు, వ్యవసాయశాఖల సహకారంతో గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నామని ప్రత్యేకాధికారి తెలిపారు. రైతులకు ఎరువులు సక్రమంలో అందే విధంగా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ప్రైవేటు డీలరు వద్ద గ్రామ వీఏఓ, సచివాలయ ఉద్యోగిని నియమించి ఎరువుల విక్రయంలో అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసున్నట్టు ఆయన చెప్పారు. తరచూ ప్రైవేటు డీలర్ల షాపులను తనిఖీ చేస్తామన్నారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతులకు 3,034 మెట్రిక్ టన్నుల ఎరువులు కావలసి ఉండగా 2,698 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. మిగిలిన 336 మెట్రిక్ టన్నులు ఒకటి, రెండు రోజుల్లో స్టాక్ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఏఎస్సై జి. శ్రీనివాసు, మండల ప్రజాపరిషత్తు ఏఓ సతీష్‌బాబు పాల్గొన్నారు.

ఊరూరా నిమజ్జనాల సందడి

- కన్నులపండువగా గణపతి విగ్రహాల నిమజ్జనాలు
- స్వామివారి ఊరేగింపులో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- డ్యాన్సులతో అలరించిన యువత


కొత్తపేటలో గణపతిని దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు


గణపతి ఊరేగింపులో భక్తులు కోలాహలం


జగ్గంపేట పుష్కర కాలువలో గణేశ్ నిమజ్జనం


అన్నవరం పంపా నదిలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న పండితులు


కత్తిపూడిలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న యువత

తుని: నియోజకవర్గంలో గణపతి విగ్రహాల నిమజ్జనాలు శనివారం వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేశ్ విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులు, తీన్‌మార్ డ్యాన్సుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. వర్షంలోనూ శోభాయాత్రలు నిర్వహించి విగ్రహాలను తాండవనదికి చేర్చారు. విగ్రహాలను క్రేన్ల సహాయంతో తాండవ నదిలో నిమజ్జనం చేశారు. శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను పట్టణ సీఐ గీతారామకృష్ణ, ఎస్సై విజయ్‌బాబు స్వయంగా పర్యవేక్షించారు.

కిర్లంపూడి: మండలంలో గణపతి విగ్రహాల నిమజ్జనాలు శనివారం ఘనంగా జరిగాయి. గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కిర్లంపూడిలోని కొత్తపేట, మసీదు సెంటర్‌లో వేంచేసిన గణపతిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు తీన్మార్ డప్పులు, డీజే సౌండ్, బాణసంచా కాల్పుల నడుమ గణపతి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నిమజ్జన ప్రదేశాల్లో ఎటువంటి ప్రమాదాలకు తావులేకుండా జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, స్థానిక ఎస్సై జి.సతీష్ దగ్గర ఉండి ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రత్తిపాడు: మండలంలో గణపతి విగ్రహాల నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో వినాయక ప్రతిమలను ఆశీనులు గావించి పుర ప్రదక్షిణ చేశారు. మేళ తాళాలు, బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ గణపతి విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ప్రత్తిపాడులోని పుష్కర కాలువ, సుద్దగెడ్డ వాగు, యర్రవరం ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. స్థానిక తోటవీధిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నిమజ్జన ప్రాంతాల్లో బందోబస్తు

గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా జరిగే నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో మండలంలోని సుద్దగెడ్డ వాగు, ప్రత్తిపాడు, రాచపల్లి, ధర్మవరం వద్ద పుష్కర కాలువలు, ధర్మవరంలోని రామభద్రరాజు, పేర్రాజు చెరువులు, పెద్దిపాలెం, చింతలూరు, వెంకటనగరం, ఉద్దండ జగన్నాథపురం, పెదశంకర్లపూడి, ఒమ్మంగి, శరభవరం తదితర గ్రామాల్లోని చెరువులు, పుష్కర కాలువ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏలేశ్వరం: గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా పట్టణంలో గణేశ్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా 30 విగ్రహాలను నిమజ్జనం చేశారు. పట్టణంలోని షిర్డీ నగర్, పెద్దవీధి, నంది వీధి, దిబ్బలపాలెం, పల్లపు వీధి తదితర ప్రాంతాల నుంచి గణపతి విగ్రహాలను తీసుకువచ్చి స్థానిక ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో తీన్‌మార్, సన్నాయి మేళం, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. మహిళలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంపా నదిలో గణేశ్ నిమజ్జనం

అన్నవరం: గణపతి నవరాత్రులు ముగియడంతో రత్నగిరిపై అనివేటి మండపం, యంత్రాలయం తదితర చోట్ల ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాలను ఘనంగా ఊరేగించి పంపా నదిలో నిమజ్జనం చేశారు. అలాగే అన్నవరం, చుట్టుపక్కల గ్రామాల్లోని గణపతి విగ్రహాలను కూడా పంపా నదిలో నిమజ్జనం చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు రత్నగిరిపై గణపతుల ఊరేగింపు ప్రారంభమైంది. మొదటి ఘాట్‌రోడ్ మీదుగా టోల్‌గేటు, మెయిన్ రోడ్ మీదుగా రెండో ఘాట్‌రోడ్డు ద్వారా పంపా నదికి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. పంపా స్నానఘట్టాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రేన్ ఏర్పాటు చేశారు. నది ఒడ్డున గల క్రేన్ మీద గణపతులను ఉంచి నదిలోపలకు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

అన్నదానం

గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ రోడ్‌లోని నల్లవినాయకుడి గుడి వద్ద నిర్వహించిన అన్నదానంలో అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు. భక్తులకు ఆహార పదార్థాలు వడ్డన చేశారు.

బొజ్జ గణపయ్యకు ఘనంగా వీడ్కోలు

జగ్గంపేట: మండలంలో గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై ఊరేగించి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో యువత డ్యాన్స్‌లతో సందడి చేశారు. జగ్గంపేట పరిసర గ్రామాల నుంచి విగ్రహాలను జగ్గంపేటలోని పుష్కర కాలవ వద్దకు తీసుకువచ్చి నిమజ్జనం చేశారు.

శంఖవరం: మండలంలో గణపతి విగ్రహాల నిమజ్జనాలు శనివారం వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులను ఆయా గ్రామాల్లో భక్తులు ఘనంగా ఊరేగించారు. డప్పులు, తీన్‌మాన్, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. జి.కొత్తపల్లి, అచ్చంపేట, కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో స్వామివార్ల ఊరేగింపు వైభవంగా జరిగింది.

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, ములగపూడి, ఎ.మల్లవరం, గిడజాం, మెరక చామవరం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం, పారుపాక, గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో విగ్రహాలను బాణసంచా కాల్పులు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్, డప్పులు వాయిద్యాలతో అంగరంగ వైభవంగా ఊరేగించి కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

గండేపల్లి: మండలంలోని వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. గండేపల్లి, మురారి, సుబ్బయమ్మపేట, మల్లేపల్లి, తాళ్లూరు, తదితర గ్రామాల్లోని గణపతి విగ్రహాలను ఉదయం నుంచి సాయంత్ర వరకూ మేళతాళాలు, తీన్‌మార్ డ్యాన్సులతో ఊరేగించి పుష్కర, ఏలేరు కాలువల్లో నిమజ్జనం చేశారు.



తునిలో గణనాథుని శోభాయాత్ర


ప్రత్తిపాడులో గణపతి విగ్రహాల ఊరేగింపు


ఏలేశ్వరంలో గణపతి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు